# (క)మిషన్ పట్టుచీర

-మల్లాప్రగడ రామారావు

"చూసేరా?"

నెమలి కంఠం రంగు కంచి పట్టుచీర. బెత్తెడు జరీ అంచుతో ధగ ధగ లాడిపోతోంది. చీర జాహ్నవి అందాన్ని ద్విగుణీకృతం చేసిందో, జాహ్నవే ఆ చీర అందాన్ని అందలమెక్కించిందో తేల్చుకోలేకపోయాడు శివరావు.

ఆ విషయం అలా వుంచితే, రావు ముఖం వెల వెల పోవడం గమనించి మురిసిపోయింది జాహ్నవి.

వెల వెల పోదూ మరి! "12 వేలు తెలుసా ఆ చీర" అన్నాడు రావు. ఇద్దరూ శ్రావణ శుక్రవారం నోముకి చీర కొనడానికి "శారీ బజార్"కి వెళ్ళినప్పుడు.

"ఇది శారీ బజారులా లేదు. మాయాబజారులా వుంది" అనుకున్నాడు రావు. విద్యుద్దీపాల వెలుగులో, కొనాలనొచ్చిన వారి ముందు కుప్పలుగా పోసిన చీరల రంగులూ, హంగులూ చూస్తూ.

దుకాణం కిటకిటలాడుతోంది. చిన్నప్పుడు, చౌక ధరల దుకాణం ముందు చేంతాడంత వున్న వరసలో రేషన్ కార్డ్ పట్టుకుని నిల్చున్న వైనం గుర్తొచ్చింది రావుకి. శారీ బజార్ ప్రవేశ ద్వారం ముందు 'క్యూ'లో నిల్చున్నప్పుడు. "ప్రజలు తిండికి పెట్టే ఖర్చు తగ్గిపోతుం దంటే, తగ్గిపోదూ మరి" అని కూడా అనుకున్నాడు రావు.

యాభయ్, అరవై వరకూ చీరలు చూసింది జాహ్నవి. జాహ్నవికి ఏదీ ఓ పట్టాన నచ్చదు. పెళ్ళికి షాపింగ్ జాహ్నవితో చేసిన అనుభవం మర్చిపోలేదు. అందుకని, ఏవేనా కొనడానికి జాహ్నవితో వెళ్ళడం ఎగ్గొట్టడమెలాగా అని పథకాలు వేస్తుంటాడు రావు. ఈసారి ఏపథకమూ ఆలోచించడానికీ వీల్లేకపోయింది.

"పెళ్ళయిన తర్వాత తొలి శ్రావణమాసం. ఆ పూనా దూరాభారం నేన్రాలేను. రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం తప్పక చేసుకోవాలని అత్తగారు మూడు సార్లు ఫోన్ చేసారు. ఫోన్ చేసిన ప్రతిసారీ మూడు మాట్లయినా హెచ్చరించారు. మీరు నాకు నచ్చిన చీర కొంటేనే వ్రతం. లేకుంటే మీ అబ్బాయి గారికి పను లతో తీరలేదు. నాతో దుకాణానికి రాలేకపోయారు. ఊరూ కొత్త, భాషా కొత్త. ఒక్కర్తినీ వెళ్ళలేకపోయాను. మన్నించండి" అని ఫోన్ చేసి చెప్పేస్తానని జాహ్నవి బెదిరించడంతో రావుకి తప్పలేదు.

"12 వేలో, 15 వేలో! చీర నాకు బాగా నచ్చింది. మీకూ నచ్చిందా, లేదా? ముందు అది చెప్పండి" అంది జాహ్నవి. వచ్చిన దగ్గర నుంచీ మొగుడి వాలకం కనిపెడుతూనే వుంది. తనే చీర చూసినా, రావు చూపు మాత్రం ధరెంతో తెలియజేస్తూ, చీరకి అంటించిన కాగితం ముక్కమీదే వుండేది. కొంచెం తక్కువ ధరున్న (అంటే ఓ రెండు వేలకి మించకుండా) చీర తను పరీక్షిస్తుంటే, రావు కళ్ళు ఆశగా చూసేవి- ఆ చీర తను తీసుకుంటుందేమోనని.

"నచ్చడం మాట తర్వాత. అంత డబ్బు పోసి... ఆ సంగతి కూడా చూడాలి కదా" నసిగాడు రావు.

"ఆ నసుగుడే వద్దు. చీర నచ్చిందా? అది తేల్చండి ముందు" కసురుకోవడానికి ఒక కొసరు తక్కువగా అడిగింది జాహ్నవి.

నచ్చలేదనడానికి ఏ కారణమూ కనబడలేదు

## ఉగాదికో వసంతం

లేత పిందెలతో మామిడి చెట్లు
లేత చిగుళ్ళతో మరిన్ని చెట్లు
లేత చిగుళ్ళు తింటూ కోయిలలు
లేత కోర్కెలకు చిగుళ్ళు
కొత్త రాగాల కోయిల గానాలు
మత్త కోకిలల పంచమ స్వరాలు!
మల్లె పూవుల సౌరభాలు
వేప పూవుల ఘుమఘుమలు
పంచాంగ శ్రవణాలు-ప్రగతి గానాలు
కవి సమ్మేళనాలు - సాంప్రదాయ రాగాలు
ఉగాదికో వసంతం పరిమళాలు
చైత్రమాస వైభోగాలు సౌందర్యాలు
వసంత ఋతువు విలాసాలు, విన్యాసాలు
పాడ్యమి తిథికి పట్టిన పట్టాభిషేకం
తెలుగువారి తొలి పండుగ ఉగాది
కొత్త సంవత్సరం జరుపుకోవడం పునాది!

-యం. లక్ష్మణరాజు

రావుకి. నిజం చెప్పాలంటే అతనికీ ఆ చీర చాలా నచ్చింది. "ఐతే... నచ్చిందంటే కొనేయాలనేనా? తనకి తాజ్‌మహల్ నచ్చింది. మెర్సిడీస్ కారు నచ్చింది. ఇంకా ఎన్నో నచ్చేయి. కానీ, ముందూ వెనకా చూసుకోవద్దూ" రావు లోలోనే గింజుకుంటున్నాడు. జాహ్నవి గొంతు పెంచలేదు కాని 'నచ్చిందా?' అని రెట్టించినపుడు, గొంతులో కించిత్ కాఠిన్యం ధ్వనించింది రావుకి. తలూపాడు. ఎందుకేనా మంచిదని, 'నచ్చిందోయ్' అని మాట కూడా జతచేశాడు.

జాహ్నవి మధురంగా నవ్వింది. "ఈ చీరకి మేచింగ్ బ్లౌజ్ పీస్ చూపించమ్మా" అంది చీరలు చూపిస్తున్న అమ్మాయితో.

"అంటే తీసుకుంటున్నట్టేనా?" అన్నాడు యింకా ఆశ చావని రావు.

జాహ్నవి ముఖం ఎర్రబారింది. రావుని తగులుతూ నిల్చున్నది కొంచెం జరిగింది. జవాబుగా 'సేల్స్‌గర్ల్'కి చెప్పింది "మళ్ళీ వస్తామ"ని. అలా అంటూనే విసవిసా బయటికి దారితీసింది.

"ఏంటీ కోపమే. సరే.. సరే. ఆ చీరే తీసుకుందాం పద" అన్నాడు రావు బతిమాలడానికి ఓ మెట్టు తక్కువలో. "వద్దులెండి. మీరా చీర కొనొద్దు. నా డబ్బుతో నేనే కొనుక్కుంటాను" అంది వెనక్కి తిరక్కుండానే.

ఈ విషయం అత్తవారి యింటివరకూ పాకుతుంది కావున 'భగవంతుడా' అని జడుసుకున్నాడు రావు. "అంటే, మీ వాళ్ళకి రాసి డబ్బు తెప్పించుకుంటావా? వాళ్ళనెందుకు యిబ్బంది పెట్టడం. పద. ఆ చీరే తెచ్చుకుందాం" అని వెనక్కి తిరిగాడు రావు. అప్పటికే దుకాణం వెలుపలికి వచ్చిన కారణాన.

వెనక్కి తిరిగిన రావు మళ్ళీ వెనక్కి తిరగవలసి వచ్చింది. జాహ్నవి అడుగులు స్కూటర్ పార్క్ చేసిన చోటుకి వడివడిగా పడుతుంటే. వెనక్కి తిరక్కుండానే, తన వెనుకనున్న రావుకి వినబడేటట్టు చెప్పింది జాహ్నవి. "మీకా భయం అక్కరలేదు. ఆ చీర ఎలాగయినా నా సంపాదనతోనే కొనుక్కుంటాను" అని.

ఇప్పుడు అదే చీరలో జాహ్నవి. అప్రతిభుడయ్యాడు రావు. జాహ్నవి నవ్వుముఖం చూసి, ధైర్యం వచ్చి "చెప్పవా నీ విజయ రహస్యం" అని బ్రతిమలాడాడు. నేనోడిపోయానని చెప్పక చెబుతూ.

❖ ❖ ❖

రమణమూర్తి భార్య తులసి కొత్త కాపురం. పాషాణ్‌లోని శ్రీ వేంకటేశ్వరాలయంలో పరిచయమయింది జాహ్నవికి. మూర్తి పూణేలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ కన్సల్టెంట్. పని ఎక్కువ. అతను బ్రహ్మచారిగా వుంటున్నప్పుడు తీసుకున్న ఒక పడక గది ఫ్లాట్‌లోనే కాపురముంటున్నారు. కనీసం మరో పడక గది వున్న ఫ్లాట్‌కి మారాలని తులసికి ఆరాటం. శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం చేయించడానికి అత్తగారూ, ఆవిడకి తోడు మావగారూ వస్తున్నారు కూడా. మూర్తికేమో తీరిక వుండదు. తులసే ఏజెంట్లని పట్టుకుని మూడు, నాలుగు ఫ్లాట్స్ చూసింది గానీ, ఏదీ నచ్చలే. 10, 12 వేల రూపాయల అద్దె, ఎంతో కొంత డిపాజిట్, ఏజెంట్‌కి కమిషన్‌గా రెండు నెలల అద్దెకు సమానమైన మొత్తం యివ్వడానికి సిద్ధమే.

## చిన్ని గాయాలు

ఒక్క రాత్రి స్త్రీ సుఖానికి
వేలు గుమ్మరించేవాడు 'మగాడు'
ఒక జీవితం స్త్రీ పొందుకు
లక్షలు తీసుకునేవాడు 'మొగుడు'
ఉన్న వారి జీవితాలు / 'వపా' రంగు చిత్రాలు
లేని వారి బ్రతుకులు / నింగి మబ్బు బొమ్మలు
రాతిబొమ్మ దేవుళ్ళకు / బంగారు రథాలు
వజ్రాల హారాలు.
మట్టి బొమ్మ మానవులకు / పొట్ట కూటి రోగాలు
మెడకు మృత్యు గాలాలు.
పచ్చదనం పేరుతో ఒక్క మొక్క
నాటినందుకు మంత్రిగారికి
హంగులూ, ఆర్భాటాలు.
ఎకరాలెకరాలు పచ్చదనం
పంచినందుకు రైతుగాడికి
అప్పులు, ఆత్మహత్యలు.
బ్రిటీష్ బ్రిడ్జీలు కూల్చడానికి
బాంబులు పెట్టాల్సొచ్చింది.
ఎంత కర్కోటకుడు?
పరాయివాడు గదా!
స్వతంత్ర భారతీయుడు
కట్టిన వంతెనలు
గాలికీ నీటికే కూలుతున్నాయి.
ఎంత జీవకారుణ్యం?
మనవాడు గదా!

**-అయినాల కనకరత్నాచారి**

## మాధుర్యం

**ఒ**కడు / మాట్లాడితే
గుండె ఆగుతుంది!
మరొకడు / మాట్లాడితే ఆగిన గుండె
కదులుతుంది!

## స్పృహ!

**కూ**రుకుపోయేడు / వాడిని లాగండి
అప్పుల బురదలో!
మునిగిపోయేడు / వీడిని లాగండి
డబ్బు లాలసలో!

## తేడా!

**పు**స్తకం / హస్తభూషణం / ఒకప్పుడు!
సెల్‌ఫోను / ప్రిస్టేజి సింబల్ / ఇప్పుడు!!

## ముద్ర!

**వ**రదలో / కొట్టుకుపోతున్నా
నీ ఓటు ముద్ర అవుతుంది!
నేత / హెలికాప్టర్ మీద తిరుగుతూ
నీ కష్టం అంచనా వేస్తాడు!!

## ఎగిరే జెండా!

**మం**చి గాలి / ఎగిరేందుకు
మంచి మనిషి / ఎగరేసేందుకు
ఉంటేనే జెండా పండగ / లేపోతే దండగ!

## బిజినెస్!

**ను**వ్వు ఓటు / అమ్ముకున్నావు / రిటైల్ బిజినెస్!
వాడు ఓట్లు / కొనుక్కున్నాడు
హోల్‌సేల్ బిజినెస్!!

## కుటిలిందులు!

**క**సితీరా / విప్లవ కవిత్వం!
ఆఫీసు కాయితాలు!!
హక్కుల కోసం / చర్చల్లో సత్కారం!
ఇల్లాలు ఇంట్లోనే!!
ప్రకృతంటే / అనంత పారవశ్యం!
కలప వ్యాపారం!!

–గుడిమెట్ల గోపాలకృష్ణ

అంతా వింటున్న జాహ్నవి మెదడులో మెరుపు మెరిసింది. తమ అపార్ట్‌మెంట్ బిల్డింగ్‌లోనే ఓ ఫ్లాట్ ఖాళీగా వుందని.

“వీలైతే రేపోసారి మా ఫ్లాట్‌కి రండి. మీకు ఆ ఫ్లాట్ చూపిస్తానంది” జాహ్నవి.

“రేపటి దాకా ఎందుకు? మీకు అభ్యంతరం లేక పోతే యిప్పుడే మీతో వస్తానంది” తులసి.

ఫ్లాట్ చూడడం, నచ్చడం, ఓనర్‌ని కలవడం, డిపాజిట్‌గా అరవై వేలకి డీడీ, ఆరు నెలల అద్దెకు గాను పన్నెండు వేల రూపాయలకు ఆరు పోస్ట్‌డేటెడ్ చెక్స్ ఇవ్వడం, ఏజెంట్ కమిషన్‌గా 12 వేలు... అన్నీ చకచకా జరిగిపోయాయి.

“ఏజెంటా ఎవరోయ్?” ప్రశ్నించాడు రావు.

“తులసికి చెప్పిందే మీకూ చెబుతున్నాను. ఏజెంటు పెద్దమనిషి. సమాజంలో పరపతి వున్నవాడు. తన పేరు బయటకు రావడానికి యిష్టపడడు. ఏజెంట్ విషయం యింటి ఓనర్ దగ్గర కూడా ఎత్తరాదు. అలాగైతేనే ఫ్లాట్ చూపెట్టడం, ఓనర్ దగ్గరికి తీసుకువెళ్ళడం. అసలందుకే ఒక నెల అద్దె మాత్రమే కమిషన్”

“హో తెలిసెన్” అన్నాడు రావు.

“మొత్తానికి ఘటికురాలివే. నీ మిషన్ పట్టుచీర జయప్రదమయినందుకు అందుకో నా అభినందనలు” అని కూడా చేర్చాడు ఎందుకయినా మంచిదని.

“తనకి యింటి ఖర్చులకని రావు నెలనెలా యిస్తున్న డబ్బుల నుంచీ ‘దాచినది చీరకు ఖర్చు చెయ్యడం తప్పింది’ అన్నమాట బయటకనని జాహ్నవి ‘దేవుడు లేడండీ’ అని మాత్రం ముక్తాయించింది.

❖ ❖ ❖

“అమ్మా, నాన్నా వచ్చేస్తారు రేపు. ఎల్లుండే వ్రతం. ఇంక మీ అన్నయ్య పట్టుచీర కొనడానికి డబ్బు పంపినట్టే. త్వరగా తయారవ్వు. శారీ బజారుకు వెళ్ళి పట్టుచీర కొనుక్కుని వద్దాం” అన్నాడు రమణమూర్తి.

“భలేవారే. ఇవాళే కొరియర్‌లో చీర పంపారు. మీకు చెప్పేవరకూ ఆగేరు కాదు” అంటూ లోపలికి వెళ్ళి, నెమలి కంఠం రంగు పట్టుచీర పట్టుకొచ్చి, 12 వేల రూపాయలని వ్రాసున్న కాగితం ముక్క మూర్తికి కనబడేలా ప్రదర్శించింది తులసి.

“నిజంగా ఏజెంట్ వుంటే ఏం? లేకుంటే ఏం?” ఒక నెల కమిషన్ తను ‘నొక్కేసి’ పుట్టింటి వారి పరువు నిలబెట్టిన సంబరం తులసి ముఖమంతా కమ్మింది. ■